క్లుప్తంగా

మైసమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపనలో గ్రామస్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కోట బాసుపల్లి గ్రామంలో మైసమ్మ తల్లి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం గ్రామంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. అనంతరం మైసమ్మ తల్లికి ప్రాణప్రతిష్ఠ చేశారు. డోలు వాయిధ్యాలు, నృత్యాలతో పలు ప్రదర్శనలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డిని (బాబు) ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ కార్యక్ర మంలో వీరేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, సురేంధర్‌రెడ్డి, నాగార్జున, మొగులప్ప, రాజు, నవీన్‌రెడ్డి, రమేశ్, మాధవరెడ్డి, నాగప్ప, వెంకటయ్య, వీవీరెడ్డిలు పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



పోటీలను ప్రారంభిస్తున్న హన్మంతు

దౌల్తాబాద్: క్రీడలతో ఆరోగ్యంగా ఉండొచ్చని గ్రామ నాయకుడు హన్మంతు పేర్కొన్నారు. బాలంపేట గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు హన్మంతు స్థానిక నాయకులతో కలిసి ఆదివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఆటలు ఆడటం వల్ల శారీరక, మానసికోల్లాసంతో పాటు శరీరం దృఢంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిములు, సప్పెట్ల శీను తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపు బాగు చేయించండి



నిరుపయోగంగా చేతి పంపు

బంట్వారం: మండల పరిధిలోని సల్బత్తాపూర్ గ్రామంలో చెడిపోయిన చేతి పంపును బాగు చేయించాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ కాలనీలోని హ్యాండ్ బోరు చెడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చేతిపంపును మరమ్మతులు చేయిస్తే కాలనీ వాసులకు కొంత నీటి కొరత తీరుతుందని చెబుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

పేదలకు మొదటి ప్రాధాన్యత

తహసీల్దార్ తారాసింగ్



రేషన్‌కార్డుల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ తారాసింగ్

తాండూరు రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో గ్రామ, పట్టణాల్లో పేదలకు మొదటి ప్రాధాన్యతగా గుర్తించాలని తాండూరు మండల తహసీల్దార్ తారాసింగ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఎల్మకన్నె గ్రామంలో కొనసాగుతున్న రేషన్ కార్డుల సర్వేను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ....ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతుందన్నారు. నిరుపేదలను గుర్తించి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గ్రామ సభలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

యాచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం నగరంలోని తన నివాసంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యానికి గురైన పేదలు.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరైదన వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తండాల్లో మూత 'బడి'

- ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు ఉండవని అపోహ
- తల్లిదండ్రులకు అవగాహనలేకే ప్రయివేటుకు మొగ్గు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



మూతపడ్డ సోమ్లు నాయక్ తండా పాఠశాల

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలలే ముందు.. ప్రయివేట్ పాఠశాలలు వద్దు అనే నినాదంతో ఎన్నో సంవత్సరాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నా ఫలితం అంతంతగానే కనిపిస్తుంది. ఈ పరిస్థితి గిరిజన తండాల్లోనే అధికంగా ఉంది. దుద్యాల్ మండల పరిధిలోని సోమ్లు నాయక్ తండా, వాల్యనాయక్ తండా, రోటి బండ తండా పాఠశాలల్లో విద్యార్థుల్లేక మూతపడుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సక్రమంగా ఉండవనే అపోహతో ప్రయివేటు పాఠశాలలవైపు మొగ్గు చూపుతున్నారని తెలుస్తుంది. గత సంవత్సరం విద్యార్థుల ప్రవేశాలు లేక అవీ మూత పడ్డాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు దగ్గర్లోని ప్రయివేట్ పాఠశాలలకు పంపేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వారు చెబుతున్నారు. ఇదే విషయై ఆయా తండా వాసులను వివరణ కోరగా గత సంవత్సరం పాఠశాలలో ఉపాధ్యాయులు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఇక్కడి పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని పలుమార్లు విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో వస్తారు..అదిగో వస్తారని చాలా రోజులుగా ఉపాధ్యాయులను కేటాయించకపోవడంతో చేసేదేమి లేక ఆయా తండాల్లోని చిన్నారులను ఇతర ప్రయివేట్ పాఠశాలకు పంపిస్తున్నట్లు తండావాసులు తెలిపారు. విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపిన తర్వాతే కొన్ని నెలలకు ఒక ఉపాధ్యాయుడిని అధికారులు కేటాయించారు. తిరిగి ఆ ఉపాధ్యాయుడిని ఎప్పుడు తొలగిస్తారోననే భయంతో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడంలేదని వారు చెబుతున్నారు.

ప్రయివేటుకు ధీటుగా వసతులు

మండలంలోని సోమ్లు నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో ప్రయివేటుకు ధీటుగా వసతులు ఉన్నాయి. బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అలాగే తాగునీటి కుళాయిలు, విశాలమైన పాఠశాల భవనం ఇలా అన్ని వసతులు కల్పించారు. కానీ విద్యార్థుల ప్రవేశాలు మాత్రం అనుకున్న స్థాయిలో జరగడం లేదు. ఆ పాఠశాలకు విద్యార్థులు రావడం లేదు. దీంతో ఆ పాఠశాలకు కేటాయించిన ఉపాధ్యాయుడు ప్రస్తుతం సాగారం తండా పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు.

అవగాహన కల్పించాలి

గిరిజన తండాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించే సౌకర్యాలపై, బోధించే విద్యాపై అవగాహన లేకపోవడంతోనే విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేట్ బడులకు పంపుతున్నారని తెలుస్తుంది. విద్యాధికారులు తండాల్లో ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పిస్తే ఫలితం ఉంటుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. దీనిపై అధికారులు స్పందిస్తే గిరిజన తండాల్లో మూత దబడ్డ బడులను తిరిగి ప్రారంభించే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. మూతపడ్డ ఆయా పాఠశాలల నిర్వహణపై అధికారుల స్పందన ఎలా ఉంటుందో వేచి చూడాలి.



నూతనంగా నిర్మించి మరుగుదొడ్లు



తాగునీటి కుళాయి

పొంచి ఉన్న ప్రమాదం

- రోడ్డు పక్కనే మురుగు కాల్వ
- రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- ఫెన్సింగ్, ఇనుప కంచె ఏర్పాటు చేయాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



ప్రమాదకరంగా మురుగు కాల్వ

దుద్యాల్: మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామం నుంచి అత్యంత ప్రత్యేకత కలిగిన మామిడి కుంట ఆంజనేయ స్వామి దేవాలయం కలదు. ఈ ఆలయానికి వెళ్లే దారికి ఆనుకుని పెద్ద మురుగు కాల్వ ప్రమాదకరంగా తయారైందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు నిత్యం చాలా మంది బైకులు, ఆటోలు, కార్లల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో మురుగుకాల్వ రోడ్డుకు ఆనుకుని ఉండడంతో వాహనాలు అదుపుతప్పి కాల్వలో పడే ప్రమదం లేకపోలేదు. ఈ మార్గం నుంచి దేవాలయానికి చాలా దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. దీంతో ఇక్కడి దేవాలయ దారి గురించి అవగాహన లేని వారికి ఇబ్బందులు తప్పవు. ఏదైనా అనుకోని సంఘటన సంభవిస్తే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఈ దారిగుండా వెళ్లేటప్పుడు రాత్రి వేళ రోడ్డు పక్కన మురుగు కాల్వ కనిపించదు. దీంతో ఇక్కడి విషయం తెలియక ప్రమాదం జరిగే అవకాశం అధికమని పలువురు వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు. గతంలో చాలా వాహనాలు అదుపుతప్పి మురుగు కాల్వలో పడిన సందర్భాలు చాలా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి అక్కడ ఫెన్సింగ్ లాంటివి, ఇనుప కంచె ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజా సంఘాల సభను జయప్రదం చేయండి



సంఘీభావం వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్ రూరల్: నియోజకవర్గ కేంద్రంలో ఈ నెల 21వ తేదీన ఎమ్మార్పీఎస్ నిర్వహించనున్న ప్రజా సంఘాల సభను జయప్రదం చేయాలని సీనియర్ నాయకుడు సోమశేఖర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వివిధ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7వ తేదీన ఎస్సీ వర్గీకరణ అమలును కోరుతూ మందకృష్ణ మాదిగ నిర్వహించనున్న వేల గొంతులు–లక్ష డప్పుల మహాప్రదర్శనను విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల ముఖ్య నాయకులు 21వ తేదీన నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు యు. రమేశ్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, కె.దస్తప్ప, దాము, గజ్జల ప్రవీణ్, యస్ మల్కప్ప, ఆర్.అంజి, మైలారం శ్రీనివాస్, మధు, చిన్నయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దౌల్తాబాద్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

దౌల్తాబాద్: మండలంలోని గోకఫసల్‌వాద్ ఉన్నత పాఠశాలలో 2006–07 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఆత్మీయసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఊశన్న, నర్సిములు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యేలు



క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యేలు, ముదిరాజ్ సంఘం నాయకులు

పరిగి: ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, పరిగి, మక్తల్ ఎమ్మెల్యేలు టి రామ్మోహన్‌రెడ్డి, వాకాటి శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం పరిగి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ముదిరాజ్‌లు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి అధికారంలోకి తీసుకువచ్చేందుకు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. పరిగిలో ముదిరాజ్ భవన్ ఏర్పాటునకు కృషి చేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాపాలన గ్రామ సభలు

పూడూరు: ప్రజాపాలన గ్రామ సభలను మంగళవారం నుంచి నిర్వహిస్తారని ఎంపీడీఓ పాండు తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పరిశీలిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో 21 నుంచి 24 వరకు రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల గురించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతారని తెలిపారు. సర్వే కోసం గ్రామాల్లోకి వచ్చే అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

సింగపూర్‌లో సీఎంను కలిసిన మండలవాసి

దుద్యాల్: సింగాపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డిని మండల పరిధిలోని నాన్యనాయక్ తండాకు చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ కిషోర్ ఆదివారం ఉదయం కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో విలేకరులకు వివరాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉన్నతచదువుల కోసం సింగాపూర్‌కు వెళ్లినట్లు చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డ్ పర్యటనను తెలుసుకుని ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారని పేర్కొన్నారు. కొడంగల్‌లో అనేక కంపనీలు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపించాలని సీఎంను కోరారన్నారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

శంకర్‌పల్లి: విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, ప్రధాన కార్యదర్శి రఘునందన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై దుండగులు దాడికి పాల్పడడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో దాడికి నిరసనగా సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: యువత స్వయం ఉపాధిలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆదివారం యువకులు ఇమ్రాన్, ఇర్ఫాన్ కలిసి స్వయం ఉపాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగొండ రవియాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కలిసిమెలిసి పోవాలన్నారు. అప్పుడే ఎంచుకున్న ఉపాధి ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువకులు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌లేకుండా వాహనాలు నడపొద్దు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అరుణ్‌కుమార్

నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్

నవాబుపేట: వాహనదారులు హెల్మెట్‌లేకుండా వాహనాలు నడపొద్దని నవాబుపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మైతాప్ఖాన్ గూడాలో వాహనదారులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకొని మనల్ని నమ్ముకున్న కుటుంబ సభ్యులను రోడ్డు పాలు చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లి బస్సును పునరుద్ధరించండి




డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డీఎంకు నాయకుల వినతి

షాద్‌నగర్: గతంలో ఉన్న విధంగా షాద్‌నగర్ నుంచి మామిడిపల్లి గ్రామం వరకు బస్సును పునరుద్ధరించాలని పలువురు నాయకులు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం డీఎంకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ నుంచి నందిగామ మండలం మామిడిపల్లి గ్రామం వరకు బస్సు నడిపించే వారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఈ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాద్‌నగర్ నుంచి అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చెర్ల అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మజీదు మామిడిపల్లి, మామిడిపల్లి గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సును నడిపించాలని కోరారు. మారుమూల గ్రామాల నుంచి ఎంతో మంది ప్రజలు, విద్యార్థులు, కార్మికులు ప్రతి రోజు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తుంటారని, అధికారులు స్పందించి మామిడిపల్లి బస్సును తిరిగి ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోండి



సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్లు మద్దిలేటి, గట్టగల్ల ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తిపై భౌతిక దాడులు చేసి, చంపేయాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పసుల రామ్మూర్తిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మరో విధంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భాను, జిల్లా ఉపాధ్యక్షుడు వన్నెపాగ వంశీ, పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్‌రావు



నూతన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నర్సింగ్‌రావు

చేవెళ్ల: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్ రావు అన్నారు. చేవెళ్లలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అత్తెల్లి అనంత్‌రెడ్డిని ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రోజు రోజుకు బలోపేతం అవుతుందని, యువత ఎంతో ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు ప్రతీ నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ మండల కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించి మండలంలోని అన్ని గ్రామ కమిటీలను కూడా వేసుకోవాలని సూచించారు. అందరం కలిసి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్గారి భార్గవ్‌రెడ్డి, జయసింహ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో..

మండలంలోని కేసారం గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం నూతన మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

శివమాల పవిత్రమైనది

దోమ: శ్రీశైల క్షేత్రానికి శివస్వాములు పాదయాత్రగా ఆదివారం బయల్దేరారు. మండల పరిధిలోని గూడూరు గ్రామంలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామికి గురుస్వామి శివానంద్ ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం శ్రీశైల పుణ్య క్షేత్రానికి పాదయాత్రగా బయల్దేరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల శివస్వాములు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: శివమాల ధారణ పవిత్రమైనదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రగా వెళ్తున్న శివస్వాములు కుల్కచర్లకు చేరుకోగానే వారిని ప్రహ్లాదరావు, భీంరెడిలు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో ప్రశాంతత లభిస్తుందన్నారు. సనాతన ధర్మాలను, ఆచార, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతీఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర టెలీకాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఘనపూర్ వెంకటయ్య గౌడ్, కుల్కచర్ల బీజేపీ మండల అధ్యక్షుడు జి. వెంకటయ్య, బిచ్చయ్య, భీమయ్య, ప్రశాంత్, చందు, కృష్ణయ్య, శంకర్, పాల్గొన్నారు.



కుల్కచర్ల: శివస్వాములకు స్వాగతం పలుకుతున్న నాయకులు